సాక్షి నాగర్‌కర్నూల్

శుక్రవారం । 22 । సెప్టెంబర్ । 2023



క్రీడాకారుల కల సాకారం

మహబూబ్‌నగర్‌లో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం పనులు తుది దశకు చేరాయి.

వివరాలు 8లో ▸



జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని పీజేపీ అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
34.3 /22.2

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



తెలకపల్లి: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అడిషనల్ డీఆర్‌డీఓ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో మహిళా సంఘాలకు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలు ఆర్థిక అభివృద్ధి చెందాలని తీసుకున్న రుణాలు సక్రమంగా సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలన్నారు. 32 గ్రామ సంఘాలకు గాను 25 గ్రామ సంఘాల సభ్యులు పాల్గొన్నారు. బ్యాంక్ లింకేజీ 2023, 24 సంవత్సరానికి 508 స్వయం సహాయక సంఘాలకు రూ.18.60కోట్లు లక్ష్యంగా ఇవ్వనున్నామన్నారు. ఇప్పటి వరకు 90 స్వయం సహాయక సంఘాలకు రూ.7.68 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. వీటితో మహిళలు ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం నిరంజన్, కోశాధికారి అమృతమ్మ, అర్చన, రేణుక, ఈశ్వరమ్మ, తిరుపతమ్మ, రామచంద్రమ్మ, నిరంజన్, మల్లమ్మ పాల్గొన్నారు.

ప్రగతిభవన్ ముట్టడిస్తాం..



నాగర్‌కర్నూల్ రూరల్: అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని లేకుంటే ప్రగతి భవన్ ముట్టడించి గోడలు బద్దలు కొడతామని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి హెచ్చరించారు. గురువారం అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో, అంగన్‌వాడీ టీచర్లు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీల్లో పనిచేస్తున్న టీచర్లకు, హెల్పర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్ స్కీంను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఒక వైపు సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు ఆందోళన చేస్తుంటే.. ప్రభుత్వం మాత్రం సమ్మెకు సంబంధం లేని సంఘాలతో చర్చలు జరపడం దుర్మార్గం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమ్మెకు పిలుపునిచ్చిన సంఘాలతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్. శ్రీనివాసులు, ఈశ్వర్, రామయ్య, మాసమ్మ, అశోక్ పాల్గొన్నారు.

రైతుల గోడు వినరా?



సాక్షి, నాగర్‌కర్నూల్: ప్రాజెక్టు కోసం ప్రభుత్వం ఎక్కడ భూసేకరణ చేపట్టినా రైతులకే తీవ్ర అన్యాయం జరుగుతోందని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో గురువారం నిర్వహించిన విలేరుల సమావేశంలో మాట్లాడారు. కుమ్మెరలోని సర్వే నంబరు 15లో రైతు అల్లోజీ కుటుంబం నుంచి సేకరించిన ఐదెకరాల భూమికి రిజర్వాయర్ ముంపుతో సంబంధం లేదని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రాజెక్టు అవసరానికి మించి భూమిని ఎందుకు బలవంతంగా సేకరిస్తున్నారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అల్లోజీ కుటుంబం తమకు 5 ఎకరాల భూమిని అప్పగించాలని హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో బెదిరించడం దుర్మార్గమని చెప్పారు. ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి రైతులపై ప్రేమ ఉంటే అధికారుల సమక్షంలో మాట్లాడాలి కానీ ఆయన ఇంట్లో సెటిల్‌మెంట్ చేస్తారా? అని ప్రశ్నించారు. రూ.లక్షల విలువైన భూమికి ఎకరాకు రూ. 2.04 లక్షలు ఇవ్వడం ఎక్కడా లేదన్నారు. రైతు అల్లోజీ ఆత్మహత్య చేసుకుంటే స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఏమీ పట్టడం లేదని విమర్శించారు. వారి వల్లే అమాయకుల ప్రాణాలు పోతున్నాయని ఆరోపించారు. అల్లోజీ ఆత్మహత్య ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు. బాధిత రైతు కుటుంబానికి కాంగ్రెస్ అండగా ఉంటుందని, అల్లోజీ కూతురు, కుమారుడి చదువుకు అవసరమైన ఖర్చును తాము భరిస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్టు టన్నెల్, రిజర్వాయర్లు, మెడికల్ కళాశాల పేరుతో ప్రజాప్రతినిధులు, అధికారులు అవసరానికి మించి భూమిని రైతుల నుంచి సేకరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బాలాగౌడ్, శశిధర్‌రెడ్డి, అర్థం రవి, లక్ష్మయ్య, రాములు, పాండు పాల్గొన్నారు.

'జిల్లాలోని కొల్లాపూర్ పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో డ్రైయినేజీ దుస్థితి ఇది. పట్టణంలోని మురుగు ఈ డ్రైయినేజీ ద్వారా పాఠశాల ఆవరణలోకి వెళ్తుంది. మున్సిపల్ అధికారులు ఏళ్లుగా డ్రైయినేజీ మరమ్మతు చేపట్టక, చెత్తాచెదారాన్ని తొలగించకపోవడంతో పరిసరాలన్నీ అధ్వానంగా తయారయ్యాయి. అధికారులు స్పందించి **సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.'**



పట్టని పారిశుద్ధ్యం



'ఈ ఫొటోలో కన్పిస్తుంది జిల్లాలోని అచ్చంపేట పట్టణం రెండో వార్డు పరిధిలోని సాయి నగర్ ప్రాంతం. వర్షాకాలం కావడంతో వర్షపు నీరు ఇళ్లమధ్య ఉన్న ఖాళీ ప్రదేశంలో నిలిచి ఇలా మురుగుగా మారింది. రోజుల తరబడి నీరు నిలిచి ఉండటంతో దోమల ఉధృతి బాగా పెరిగింది. నిత్యం దోమలతో ఇబ్బందులు పడుతున్నా.. అధికారులు ఎవరూ స్పందించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.'

- జిల్లాలోని మున్సిపాలిటీల్లో అస్తవ్యస్తంగా నిర్వహణ
- దోమల విజృంభణతో జిల్లా వ్యాప్తంగా పెరుగుతున్న డెంగీ కేసులు
- జిల్లాలోని పట్టణాల్లో అధ్వానంగా డ్రైయినేజీల పరిస్థితి
- నామమాత్రంగా మారిన 'డ్రై డే' కార్యక్రమం

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాలోని పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వర్షాకాలం నేపథ్యంలో మురుగు కాల్వలు ఉప్పొంగి ప్రవహిస్తుండగా.. డ్రైయినేజీలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. ఇళ్ల మధ్య నీరు నిలిచి దోమల విజృంభణకు కారణం అవుతున్నాయి. ఖాళీ స్థలాల్లో నీరు, పిచ్చి మొక్కలతో దోమల ఉధృతి పెరిగి రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి ముందుజాగ్రత్త చర్యలు పాటించాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా డెంగీ కేసులు..

దోమల విజృంభణ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఇప్పటికే ప్రమాదకరమైన డెంగీ కేసుల సంఖ్య పెరుగుతోంది. గతేడాది మొత్తం 40 వరకు డెంగీ కేసులు నమోదుకాగా, ఈ సీజన్‌లో ఇప్పటికే 8 డెంగీ కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. మరో 20 వరకు మలేరియా కేసులు ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదు కాని కేసులు ఇంకా ఎక్కువ సంఖ్యలోనే ఉన్నట్టు తెలుస్తోంది. దోమల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం..

జిల్లా కేంద్రంలో దోమల నివారణకు అవసరమైన ఫాగింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. నిత్యం వార్డుల్లో ఫాగింగ్ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వర్షాకాలం నేపథ్యంలో మురుగు నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నాం. ఇళ్ల మధ్య నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలి.

– జయంత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, నాగర్‌కర్నూల్

మురుగు తొలగించాలి..



ఇళ్ల మధ్యలో ఉన్న మురుగును వెంటనే తొలగించాలి. చాలా రోజులుగా మురుగు ఉండటంతో దోమల బెడద తీవ్రమవుతుంది. కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారు. మున్సిపల్ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి మురుగు నీటిని మల్లంకుంటలోకి వెళ్లేలా చూడాలి.

– మంజుల, సాయినగర్ కాలనీ, అచ్చంపేట

ఎక్కడా కన్పించని ఫాగింగ్ ప్రక్రియ

వానాకాలం సీజన్‌లో దోమల నిర్మూలనకు ప్రత్యేకంగా ఫాగింగ్ ప్రక్రియను చేపట్టాల్సి ఉన్నా.. జిల్లాలోని మున్సిపాలిటీల్లో మాత్రం అమలుకావడం లేదు. జిల్లా కేంద్రంలో 4, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి పట్టణాల్లో మూడు చొప్పున ఫాగింగ్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు చెబుతున్నా యంత్రాలు మూలకే పరిమితం అవుతున్నాయి. జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఇప్పటివరకు ఎక్కడా అధికారులు ఫాగింగ్ చేపట్టడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

ఎక్కడిదక్కడే..

జిల్లా కేంద్రంతో పాటు కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట మున్సిపాలిటీల్లో వర్షాకాలం నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సి ఉండగా.. ఎక్కడా ఆ పరిస్థితి కన్పించడం లేదు. ఇళ్ల మధ్య ఖాళీ ప్రదేశాల్లో నీరు నిలిచి, పిచ్చి మొక్కలతో నిండిపోయి కన్పిస్తున్నాయి. క్రమంగా దోమల ఉధృతి పెరుగుతోంది. మున్సిపాలిటీల్లో ప్రత్యేకంగా ప్రతి శుక్రవారం 'డ్రై' డే పేరుతో పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టాల్సి ఉండగా.. జిల్లాలో మాత్రం ఈ కార్యక్రమం నామమాత్రంగా మారిందన్న విమర్శలున్నాయి. పట్టణాల్లోని ఓపెన్ నాలాలతో పాటు కాలనీల్లోని డ్రైయినేజీలను పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. కొన్నిచోట్ల స్థానికులు ఫిర్యాదు చేస్తున్నా అధికారులు, సిబ్బంది అటువైపు కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలున్నాయి. కనీసం వర్షాకాలం సీజన్‌లోనైనా వారం, పది రోజులకు ఒకసారి డ్రైయినేజీల్లో పూడికతీత పనులు చేపట్టాల్సి ఉన్నా.. చాలాచోట్ల ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. ఖాళీ ప్రదేశాల్లో దోమల నివారణకు, దోమలు వృద్ధిచెందకుండా రసాయనాలు చల్లాల్సి ఉండగా, మున్సిపాలిటీల్లో ఆ ఊసే లేకుండా పోయింది.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు

కందనూలు: హన్మకొండలోని జేఎన్ స్టేడియంలో నిర్వహించే ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా క్రీడాకారులు వరంగల్ వెళ్లారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సోలపోగుల స్వాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న కల్వకుర్తి పట్టణంలోని సీబీఎం కళాశాల మైదానంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించామన్నారు.

ఎంపికైన క్రీడాకారులు..: లింగాల నవ్య(100 మీటర్ల లాంగ్‌జంప్), కేతావత్ ధనలక్ష్మి(100 మీ. లాంగ్‌జంప్), పిట్టల జయంతి(200 మీ. 400 మీ), అండపల్లి జాన్వి (800 మీ. 3 వేల మీ, 5 వేల మీ), నీలం జ్యోత్స్న (800 మీ, 3 వేల మీ/ 5 వేల మీ), కొడావత్ మధులత(1500మీ– 3వేల మీ/5వేల మీ), నేరెళ్ల అనూష (3వేల మీ/5వేల మీ), నీల లక్ష్మీదేవి (3 వేల మీ/5వేల మీ), హన్సిక (షాట్ పుట్–ట్రిపుల్ జంప్), బుచ్చమ్మ,(షాట్ పుట్–డిస్కస్ త్రో), టి.శ్రీవల్లి (డిస్కస్ త్రో, హై జంప్), పౌర్ణమి,(400 మీ–హై జంప్), ఎన్.శ్రీలేఖ (డిస్కస్ త్రో, ట్రిపుల్ జంప్), డాకూరి పార్వతి(జావెలిన్ త్రో), మన్నం పల్లవి (జావెలిన్ త్రో) ఉన్నారు.

టీచర్ పోస్టులు పెంచాల్సిందే..

- తక్కువ పోస్టులు కేటాయించడంపై నిరుద్యోగుల్లో అసంతృప్తి
- ఉమ్మడి జిల్లాలో కేవలం 586 పోస్టుల భర్తీకి అనుమతి
- టీఆర్టీ దరఖాస్తు ఫీజు తగ్గించాలని డిమాండ్
- మహబూబ్‌నగర్‌లో అభ్యర్థుల ఆందోళన



మహబూబ్‌నగర్ తెలంగాణ చౌరస్తాలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న టీఆర్టీ అభ్యర్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఏళ్ల తరబడి నిరుద్యోగులు ఎదురుచూస్తుండగా.. ఎట్టకేలకు ప్రభుత్వం టీఆర్‌టీ నోటిఫికేషన్ విడుదల చేసింది. కానీ.. ఆ ఆనందం నిరుద్యోగుల్లో ఎక్కువ సేపు నిలవలేదు. వేలల్లో అభ్యర్థులు ఉండగా.. ప్రభుత్వం మాత్రం చాలా తక్కువ సంఖ్యలో పోస్టుల భర్తీకి అనుమతి ఇవ్వడమే ఇందుకు కారణం. దీంతో పోస్టులు పెంచాలని.. అలాగే, టీఆర్టీ దరఖాస్తు ఫీజును తగ్గించాలని ఆందోళన బాట పట్టారు. గురువారం మహబూబ్‌నగర్‌లో అభ్యర్థులు నిరసన ర్యాలీ చేపట్టారు. జిల్లాకేంద్రంలోని మెట్టుగడ్డ నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టి 'మినీ డీఎస్సీ వద్దు, మెగా డీఎస్సీ వేయాలి' అని నినదించారు. అనంతరం తెలంగాణ చౌరస్తాలో బైఠాయించి నిరసన చేపట్టారు. ఈమేరకు టీఆర్టీ అభ్యర్థుల నిరసనకు కాంగ్రెస్ నాయకుడు హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీతో పాటు పలు సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ఉమ్మడి జిల్లాలో టెట్‌కు రెండు పేపర్లు కలిపి దరఖాస్తులు చేసుకున్న వారు 80 వేలకు పైగా ఉండడంతో ఒక్కో పోస్టుకు 140 నుంచి 150 మధ్య పోటీ ఉండే అవకాశం ఉందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

13వేల పోస్టులతో మెగా డీఎస్సీ వేయాలి

ఉమ్మడి జిల్లాలో పోస్టులు 586 ఉండి జిల్లాల వారీగా తక్కువ పోస్టులు ఉన్నాయి. పోస్టులు సబ్జెక్టులు, కేటగిరీలు, కేడర్‌ల వారీగా చూస్తే ఒక్కో పోస్టు కూడా ఉండడం లేదని పలువురు అభ్యర్థులు పేర్కొంటున్నారు. రిజర్వేషన్ టేబుల్‌లో పోస్టుల సంఖ్య కంటే సున్నాలే ఎక్కువగా ఉన్నాయన్నారు. ఎన్నో ఏళ్లుగా డీఎస్సీ వేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటి నుంచి అన్ని వదులుకుని టీఆర్టీకి సిద్ధమవుతున్నామని, కానీ ప్రభుత్వం చాలీచాలని పోస్టులు ఇవ్వడం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతుందని వెంటనే పోస్టులు పెంచాలన్నారు. అసెంబ్లీలో ప్రకటించిన విధంగా 13వేలకు పైగా పోస్టులతో మెగా డీఎస్సీ వేయాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఏ పరీక్షకు లేని విధంగా ఫీజులు ఏకంగా రూ.వెయ్యి పెట్టారని, నిరుద్యోగులు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నారని ఫీజులు వెంటనే రూ.200లకు తగ్గించాలని డిమాండ్ చేశారు.

➩ మహబూబ్‌నగర్‌లో 415 పోస్టులు, నాగర్‌కర్నూల్‌లో 450, నారాయణపేటలో అత్యధికంగా 470 పోస్టులు ఉన్నాయి. ఇక గద్వాల, వనపర్తిలో 316 పోస్టుల చొప్పున ఖాళీలు ఉన్నాయి. ఇలా వీటిలో 30శాతం పోస్టులు ప్రమోషన్‌లకు వదిలేసినా.. ఉమ్మడి జిల్లాలో దాదాపు 1400 పోస్టులు నేరుగా భర్తీ చేయాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వం పోస్టులను భర్తీ చేయడమే తక్కువ భర్తీ చేస్తున్నట్లు పలువురు అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తక్కువ పోస్టులతో ఇబ్బంది

వాస్తవంగా బడుల్లో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేస్తే పోస్టుల సంఖ్య పెరుగుతుంది. కానీ తక్కువ పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే వీటిలో ఒక్కో పోస్టుకు వందల సంఖ్యలో పోటీ పడాల్సి వస్తోంది. కేటగిరిలు, సబ్జెక్టు వారీగా చూస్తే కొన్ని సున్నా పోస్టులు ఉన్నాయి. ఎంతో ఖర్చులు భరిస్తూ చదువుతున్నాం. దీన్ని దృష్టిలో పెట్టుకొని వెంటనే పోస్టులను పెంచాలి.

– మేఘమాల, టీఆర్టీ అభ్యర్థి

నేరచరిత్ర ఉన్నవారిపై ప్రత్యేక నిఘా

కలెక్టర్ ఉదయ్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్ క్రైం: రాబోయే ఎన్నికల్లో నేరచరిత్ర **ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ పోలీసు అధికారులకు సూచించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో జిల్లాలోని పోలీసు అధికారులకు ఎన్నికల శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎస్పీ మనోహర్ మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడటంలో నాగర్‌కర్నూల్ జిల్లా ముందంజలో ఉండాలని, నేరాలు జరగకుండా చూడాలన్నారు. 2018 ఎన్నికల్లో నేర చరిత్ర ఉన్న అందరి మీద ప్రత్యేక నిఘా ఉంచాలని, నేరచరిత్ర ఉన్న వారిని ఆయా పోలీస్‌స్టేషన్లలో బైండోవర్ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో సమ**స్యాత్మకంగా ఉన్న గ్రామాలను గుర్తించి అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల వారీగా సమస్యలు సృష్టించే వారిని గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ రామేశ్వర్, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

'కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం అందరికీ ఆదర్శం'



లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి శ్రీధర్

నాగర్‌కర్నూల్: తెలంగాణ తొలి తరం పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం అందరికీ ఆదర్శమని బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి శ్రీధర్ అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 11వ వర్ధంతి సందర్భంగా గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తుది శ్వాస వరకు తెలంగాణకై పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీని స్మరించుకోవడం తెలంగాణ ఉద్యమాన్ని గుర్తు చేసుకోవడమేనని అన్నారు. నాడు తెలంగాణ ఉద్యమ సమయంలో కీలక పాత్ర వహించారని అన్నారు. అనేక సందర్భాల్లో వారు చేసిన సేవలను గుర్తు చేస్తూ.. బాపూజీ ఆశయాలను కొనసాగించాలని కోరుతూ నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు గుడిపల్లి నిరంజన్, కృష్ణమోహన్, కుకుడాల వెంకటస్వామి, నాగర్‌కర్నూల్ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, పట్టణ పద్మశాలి సంఘం కోశాధికారి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైంది

అదనపు కలెక్టర్ కుమార్ దీపక్



ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అదనపు కలెక్టర్ కుమార్ దీపక్



ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

నాగర్‌కర్నూల్: ప్రపంచ గతిని మార్చగల శక్తి ఒక్క 'ఓటు'కే ఉందని, అలాంటి ఆయుధాన్ని వృథా చేసుకోవడం, లేదా ప్రలోభాలకు గురై అమ్ముకోవడం వంటివి చేయడం రాజ్యాంగ విరుద్ధం అని నాగర్‌కర్నూల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓటు వినియోగం విశిష్టతపై 18 సంవత్సరాలు నిండిన నూతన ఓటర్లు నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట పట్టణాల్లోని డిగ్రీ, ఇంటర్మీడియట్ కళాశాలల విద్యార్థులతో జిల్లా స్థాయి నాటక సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ వంతు కర్తవ్యంతో ఉన్నత నాయకులను ఎన్నుకునే విధానమే ఎన్నిక అని చెప్పారు. ప్రతి పౌరుడు తమ ఓటును వినియోగం చేసుకుని సరైన నాయకుడిని ఎన్నుకున్నప్పుడే రాజ్యాంగ పరిరక్షణ జరుగుతుందని చెప్పారు. పురుషులతో పాటు మహిళలకూ సమాన ఓటు హక్కును రాజ్యాంగం కల్పించిందన్నారు. అక్టోబర్ ఒకటి 2023 వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలియజేశారు. ఓటు విశిష్టతపై విద్యార్థులు నిర్వహించిన నాటక ప్రదర్శన ప్రతిఒక్కరిని ఆకట్టుకున్నాయి. నాటక ప్రదర్శనలో కొల్లాపూర్ డిగ్రీ కాలేజ్ విద్యార్థులు ప్రదర్శించిన నాటికకు మొదటి బహుమతి, నాగర్‌కర్నూల్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రెండో బహుమతి, నాగర్‌కర్నూల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు మూడో బహుమతి గెలుపొందారు. ఈ నెల 26న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి నిర్వహించే పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు పాల్గొననున్నారు. గెలుపొందిన విద్యార్థులను అభినందించి బహుమతి ప్రదానం చేశారు. జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి, గుడిపల్లి నిరంజన్, కృష్ణమోహన్, స్వీప్ నోడల్ అధికారి రామ్మోహన్‌రావు, డీఈఓ గోవింద రాజులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్



క్రీడా జ్యోతిని క్రీడాకారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి: క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. గురువారం పట్టణంలోని మహాత్మాజ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని 14 పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను విద్యార్థులు సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే క్రీడాకారుల వందనం స్వీకరించి క్రీడాజ్యోతిని వెలిగించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను, క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రంలో గురుకులాల సంఖ్య 1001కి పెరిగిందన్నారు. ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం రూ.1.20 లక్షలు ఖర్చు చేస్తుందన్నారు. గురుకుల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు. ఈ ఏడాది బడ్జెట్‌లో విద్యాభివృద్ధికి రూ.26 వేల కోట్లను కేటాయించిందని చెప్పారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు రూ.7,300 కోట్లను 'మన ఊరు– మన బడి' పథకంలో కేటాయించిందన్నారు. విద్యార్థులు క్రీడల్లో గెలుపుఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించి కల్వకుర్తికి పేరు తీసుకురావాలన్నారు. కొద్దిసేపు వాలీబాల్ క్రీడల్లో పాల్గొని ఎమ్మెల్యే పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, ఎంపీపీ మనోహర, మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, వైస్ఎంపీపీ గోవర్ధన్, పాఠశాల ప్రిన్సిపాల్ కవిత, వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు సైదులుగౌడ్, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోనేరులో మునిగి వ్యక్తి మృతి

జడ్చర్ల: జడ్చర్ల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని కోనేరులో పడి ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. వెంకటేశ్వర కాలనీకి చెందిన నర్సింహులు, (42) సమీప గణేష్ మండపం దగ్గర భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ చేసి చేతులు శుభ్రం చేసుకునేందుకు పక్కనే ఉన్న కోనేరులోకి దిగాడు. చేతులు కడుక్కుంటుండగా మెట్లపై పాకర ఉండడంతో కాలు జారీ ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. ఆ సమయంలో ఎవరు గమనించక పోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. అతనికి భార్య గంగ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాలేదని సీఐ రమేశ్ బాబు తెలిపారు.

మహిళా అనుమానాస్పద మృతి

రాజాపూర్: మండలంలోని చెన్నవెల్లిలో ఓ మహిళ అనుమాదస్పదంగా మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి వివరాల ప్రకారం జడ్చర్ల పాతబజారుకు చెందిన పిట్టల జయమ్మ(36)తో 18 సంవత్సరాల కిందట చెన్నవెల్లి గ్రామానికి చెందిన లవయ్యతో వివాహం అయ్యింది. భార్యాభర్తల మధ్య తరుచుగా గొడవలు జరుగుతుండేవి. భార్య చనిపోయిందని ఇంటి ముందు భర్త కన్నీటిపర్యంతం అయ్యాడు. కుటుంబసభ్యులు, చుట్టుపక్కల వారు గమనించి ఇంట్లోకి వెళ్లిచూడగా జయమ్మ విగత జీవిగా కనిపించింది. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అల్లుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతురాలి తండ్రి కొడుగంటి పెంటయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

చెరువులో బోరు మోటారు తీసేందుకు వెళ్లి..

ఖిల్లాఘనపురం: ప్రమాదవశాత్తుతో చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీహరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కమాలొద్దీన్‌పూర్‌కి చెందిన కమ్మ నర్సింహులు(38) గ్రామంలోని నాగసముద్రం చెరువులో కృష్ణయ్యకు చెందిన కాలిపోయిన బోరు మోటారు బయటకు తీసేందుకు వెళ్లాడు. కాలిపోయిన మోటార్ తీసే క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. మృతుని భార్య చిట్టెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసుకుని మృతదేహాన్ని చెరువు నుంచి వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వ్యక్తి బలవన్మరణం

హన్వాడ: భార్య పుట్టింటికి వెళ్లిందని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం మండలంలోని ఇబ్రహీంబాద్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ రవినాయక్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన బోవి మంగమ్మ భర్త బాలయ్య (38)తో గొడవపడి తల్లిగారి ఇంటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన బాలయ్య ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బాలయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లి నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

బాలిక ఆత్మహత్య

మిడ్జిల్: మండలంలోని రాణిపేటలో ఓ బాలిక పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. ఆయన కథనం మేరకు.. బాలికకు చిన్నాన్న వరుస అయ్యే వ్యక్తి ప్రేమిస్తున్నానంటూ వేధించడంతో బుధవారం రాత్రి ఇంట్లో పురుగుమందు తాగింది. గురువారం కుటుంబ సభ్యులు చూసే సరికి మృతిచెంది కనిపించింది. తండ్రి ఫిర్యాదు మేరకు గురువారం సాయంత్రం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి మృతిపై కేసు నమోదు

అడ్డాకుల: మూసాపేటలో నివసించే రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి రేమద్దుల గంగపురి(55) మృతిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఇంట్లో చనిపోయి ఉన్న గంగపూరి మృతదేహాన్ని బంధువులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా జిల్లా ఆస్పత్రికి తరలించారు. విదేశాల్లో ఉన్న కుమారుడు రావడంతో గంగపురి భార్య లత గురువారం మూసాపేట ఠాణాలో ఫిర్యాదు చేసింది. కేసునమోదు చేసిన పోలీసులు మార్చురీలో ఉన్న మృతదేహానికి పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు.

మట్కారాయుళ్ల అరెస్ట్

మక్తల్: ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతున్న ముగ్గురిని గురువారం అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ రాంలాల్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. పట్టణానికి చెందిన తాజ్, చాంద్‌పాషా, కుర్వ నర్సప్ప కళ్యాన్ అనే ఆన్‌లైన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వారితో పాటు మరికొందరితో మట్కా ఆడిస్తున్నారని.. వారికి వచ్చిన డబ్బులో 10 శాతం కమీషన్ తీసుకుంటున్నట్లు వివరించారు. సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ గేమ్, జూదం, మట్కా, క్రికెట్ బెట్టింగ్ వంటి ఆటలు ఆడి మోసపోవద్దని సూచించారు. ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్ఐ పర్వతాలు పాల్గొన్నారు.

క్రీడాకారుల కల సాకారం

- చివరి దశలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం పనులు
- రూ.7.79 కోట్లతో నిర్మాణం
- ఉడెన్ కోర్టుల ఏర్పాటు



ఉడ్‌తో ఏర్పాటు చేసిన కోర్టు



నిర్మాణంలో ఉన్న మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం పనులు తుది దశకు చేరాయి. రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కృషితో ఉమ్మడి జిల్లాకే తలమానికంగా స్టేడియం నిర్మాణం జరుగుతోంది. ఏళ్లుగా ఎదురుచూస్తున్న క్రీడాకారుల కల త్వరలో నెరవేరబోతుంది. అన్ని హంగులు, వసతులతో నిర్మిస్తున్న స్టేడియం త్వరలో ప్రారంభం కానుంది.

తుది దశలో పనులు..

రూ.7.79 కోట్లతో అధునాతన సౌకర్యాలతో నిర్మాణం జరుగుతోంది. స్టేడియం నిర్మాణంపై మంత్రి ఎప్పటికప్పుడు అధికారులకు దిశానిర్దేశం చేస్తూ పనుల వేగవంతం కోసం తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే గ్రౌండ్, రెండో ఫ్లోర్‌లో పెవీలియన్, ఇతర గదుల పనులు పూర్తి చేశారు. టేబుల్ టెన్నీస్ హాల్, బాక్సింగ్ హాల్‌తో పాటు స్టోర్ రూం, క్రీడాకారుల గదులను ఏర్పాటు చేశారు. పోటీలను తిలకించడానికి రెండు వైపుల గ్యాలరీలు ఏర్పాటు చేసి సీట్లు అమర్చారు. ఉడెన్ బాస్కెట్‌బాల్ కోర్టు, మూడు షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులు ఏర్పాటు చేశారు. స్టేడియం బయటి గోడలపై అంతర్జాతీయ క్రీడాకారుల చిత్రాలను ఏర్పాటు చేయనున్నారు.

మెరుగైన వసతులు..

మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులకు అన్నిరకాల వసతులు కల్పిస్తున్నారు. నిర్మాణం పూర్తయితే వెయిట్ లిఫ్టింగ్, జూడో, బాక్సింగ్, కబడ్డీతో పాటు ఇతర ఇండోర్ క్రీడలు ఆడే అవకాశం ఉంది. అదేవిధంగా షటిల్ బ్యాడ్మింటన్, లాన్ టెన్నీస్, టెన్నికాయిట్, వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నీస్ తదితర క్రీడాకారులు ప్రాక్టీస్ చేసుకోవడానికి ఆస్కారం ఉంది. భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయి ఇండోర్ క్రీడాపోటీలకు మహబూబ్‌నగర్‌లోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం వేదికగా మారే అవకాశం ఉంది.

త్వరలో ప్రారంభం..



మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కృషితో జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ఏర్పాటవుతుంది. త్వరలోనే ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. స్టేడియంలో క్రీడాకారులకు అన్నిరకాల వసతులు కల్పిస్తున్నాం. నిష్ణాతులైన కోచ్‌లు వస్తారు. అంతర్జాతీయస్థాయిలో క్రీడాకారులను తీర్చిదిద్దవచ్చు.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్ఓ, మహబూబ్‌నగర్

భవిష్యత్ ఫుడ్ ప్రాసెసింగ్‌దే..



మాట్లాడుతున్న శాస్త్రవేత్త జ్యోత్స్న

బిజినేపల్లి: భవిష్యత్‌లో ఫుట్ ప్రాసెసింగ్‌కే అధిక ప్రాధాన్యం ఉంటుందని పాలెం కేవీకే గృహవిజ్ఞాన శాస్త్రవేత్త జ్యోత్స్న అన్నారు. గురువారం పాలెం కేవీకే, డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలకు మూడురోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ వ్యవసాయంలో ప్రత్యక్షంగా ఆహార ఉత్పత్తులను విక్రయించడం కంటే.. ప్రాసెసింగ్ చేసి ఆకర్షణీయంగా మార్కెట్‌కు తరలిస్తే అధిక లాభాలు ఉంటాయన్నారు. ఆహార అనుబంధ సంస్థల స్థాపనకు కావాల్సిన ప్రణాళిక, వసతులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మహిళలు ఒక సమూహంగా ఏర్పడి చిన్న చిన్న వ్యాపారాలను స్థాపించాలని తెలిపారు. తద్వారా కుటుంబ పోషణ, ఆర్థిక స్థిరత్వం సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి, డీఆర్డీఏ ఏపీఓ శ్రీనివాస్, ఏపీఎం సుధాకర్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన కేంద్ర బృందం



సిబ్బందితో సమావేశమైన కేంద్రం బృందం సభ్యులు

గట్టు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం కేంద్ర బృందం (ఎన్‌కాస్) సభ్యులు డా. రిజికుమార్, జ్ఞానరంజన్‌కుమార్ సందర్శించారు. పీహెచ్‌సీతో పాటు ఆయా సబ్‌సెంటర్ల పరిధిలో రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న మందులు, ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో వైద్యసిబ్బందితో సమావేశమై ప్రసవాలు, స్వచ్ఛత, రోజువారీగా రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి స్రవంతి, వైద్యాధికారులు హరీశ్, రాజు, ఎన్‌కాస్ టీం మేనేజర్ రాజ్‌కుమార్, సీహెచ్ఓ ఊస్సేని, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో అగ్ని ప్రమాదం



గోదం గోడలు పగలగొట్టి మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

- గోదాంలో నిల్వ ఉంచిన వరిధాన్యం బస్తాలు దగ్ధం
- ఫైర్‌సిబ్బంది, పోలీసుల చొరవతో తప్పిన భారీ నష్టం

నవాబుపేట: రైతులతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి మిల్లర్లకు అందించింది. కాగా మిల్లర్లు మార్కెట్ యార్డులో గోదాంలో వాటిని భద్రపరిచారు. కాగా ఆ ధాన్యం నిల్వ ఉంచిన గోదాంలో ఒక్కసారిగా మంటలు రేగడంతో అందరూ ఉలిక్కిపడ్డారు. వెంటనే తేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వటంతో స్థానిక పోలీసుల సాయంతో గోదం గోడలు పగలకొట్టి ధాన్యం ఎక్కువగా అగ్నికి ఆహుతి కాకుండా ఆపగలిగారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం మధ్యాహ్నం మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులోని ధాన్యం గోదాం నుంచి పొగలు వచ్చాయి. దీంతో అక్కడ ఉన్న వ్యాపారులు చూసి పోలీసులకు, ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే వారు అప్రమత్తం కావటంతో 12 వేల బస్తాలు ఉంచిన గోదాంను పెద్ద నష్టం జరగకుండా కాపాడారు. ప్రమాదంలో దాదాపుగా 500 బస్తాల వరకు ధాన్యం అగ్నికి ఆహుతి అయ్యింది. నిత్యం అక్కడే ఉండే మార్కెట్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించటంతోనే ధాన్యం అగ్నికి ఆహుతి అయ్యిందని, అక్కడ ఉన్న రైతులు వాపోయారు. కాగా బుధవారం మార్కెట్ యార్డులోని ధాన్యం నిల్వ ఉంచిన గోదం పక్కనే చెత్తను చేర్చి మంట పెట్టినట్లు తెలుస్తుంది. ఆ మంటల కారణంగా ధాన్యం గోదాంలోకి మంటలు వ్యాపించాయని రైతులు ఆరోపించారు. నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన మార్కెట్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించటంతోనే ఈ ప్రమాదం జరిగిందని రైతులు వాపోతున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం..

మార్కెట్ అధికారులు సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండటంతోనే ప్రమాదం జరిగిందని చెత్తను ధాన్యం గోదం పక్కన వేసి మంటలు వేస్తే అధికారులు ప్రేక్షకపాత్ర పోషించి ధాన్యం దగ్ధానికి కారణమయ్యారు. మార్కెట్‌లో సీజన్ లేకున్నా.. అధికారుల పర్యవేక్షణ లేకపోవటం చాలా దారుణం. ఈ విషయంలో నిర్లక్ష్యంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మయ్య, మార్కెట్ చైర్మన్ నవాబుపేట

ఇంట్లోకి దూసుకెళ్లిన టిప్పర్

- వృద్ధురాలికి గాయాలు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి



మక్తల్‌లో ఇంట్లోకి దూసుకెళ్లిన బూడిద టిప్పర్

మక్తల్: బూడిద లోడ్‌తో ఉన్న టిప్పర్ కర్ణాటక నుంచి హైదరాబాద్ వెళ్తుంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి 11 గంటలకు మక్తల్ నల్లజానమ్మ దేవాలయం మలుపు వద్దకు రాగానే డ్రైవర్ అజాగ్రత్తతో పక్కనే ఉన్న ఇంట్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. మక్తల్‌కు చెందిన ఇంటి యాజమానురాలు పద్మమ్మ స్వల్పంగా గాయపడింది. ఈ విషయం తెలుసుకున్న మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి రాత్రి అక్కడికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వృద్ధురాలిని మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బూడిద టిప్పర్ ఇంట్లోకి తీసుకెళ్లడంతో రోడ్డుకు ఇరువైపుల ఉన్న స్తంభాలు విరిగిపోయి, ఇట్లోంని వడ్రంగి పరికరాలు విరిగిపోయి, ఇల్లు మొత్తం బూడిదమయమైంది. బూడిద లారీలకు అనుమతి ఎవరు ఇచ్చారని పోలీసులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పర్వతాలు తెలియజేశారు. టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

రేషన్ బియ్యం పట్టివేత

చిన్నచింతకుంట: మండలంలోని కురుమూర్తి స్టేజీ వద్ద రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని బుధవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. అమరచింత మండలానికి 13 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా.. పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ ఐ శేఖర్ తెలిపారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గడ్డి క్షేత్రాల నిర్వహణపై అవగాహన



అటవీ సిబ్బందికి సూచనలిస్తున్న రేంజ్ అధికారి ఆదిత్య

మన్ననూర్: అమ్రాబాద్ డివిజన్ మద్దిమడుగు రేంజ్ పరిధి సోమచెల్కలో గడ్డి క్షేత్రాల (గ్రాస్ ల్యాండ్) నిర్వహణపై రేంజ్ అధికారి ఆదిత్య సిబ్బందికి గురువారం అవగాహన కల్పించారు. అచ్చంపేట డివిజన్‌కు చెందిన అమ్రాబాద్, మన్ననూర్, దోమలపెంట, లింగాల, అచ్చంపేట రేంజ్‌ల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడ్డి క్షేత్రాల నిర్వహణ, ప్రాధాన్యాన్ని వివరించారు. గడ్డి మైదానాలు సమృద్ధిగా ఉంటే శాఖాహార జంతువులు, అలాగే పెద్దపులుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. నల్లమల, అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యం మూడురకాల గడ్డి క్షేత్రాలను పెంచేందుకు అనువుగా ఉందని వివరించారు. గడ్డి క్షేత్రాలను ఆశించినస్థాయిలో పెంచితే వన్యప్రాణుల మనుగడకు కొదవ ఉండదని తెలిపారు. గతంలో ఈ ప్రాంతంలోకి ఇతర ప్రాంతాల వారు చొరబడి వన్యప్రాణులను వేటాడారని.. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో రేంజ్ అధికారులు ఈశ్వర్, శరత్‌చంద్ర, డీఆర్ఓలు, ఎఫ్ఎస్ఓలు, బీట్ అధికారులు, వాచర్లు పాల్గొన్నారు.

గంజాయి కలకలం

- అడ్డాకులలో ఇద్దరిని పట్టుకున్న పోలీసులు
- అరకిలో గంజాయి స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

అడ్డాకుల: గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు పట్టుకోవడం కలకలం రేపింది. ఇరువురి నుంచి సుమారు అరకిలో వరకు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ మాధవరెడ్డి వివరాల ప్రకారం.. పంజాబ్ రాష్ట్రానికి చెందిన రవిసింగ్ వనపర్తి జిల్లా కొత్తకోటలో ఉంటూ హార్వేస్టర్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఇతడికి అడ్డాకులకు చెందిన మునగాల నరేష్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరు కలిసి కొన్నాళ్ల నుంచి గుట్టుచప్పుడు కాకుండా అడ్డాకుల, కొత్తకోటలో గంజాయిని విక్రయిస్తున్నారు. పక్కా సమాచారం అందుకున్న సీఐ రామకృష్ణ.. ఎస్ఐ మాధవరెడ్డితో కలిసి గురువారం మండల కేంద్రం సమీపంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇద్దరిని ఠాణాకు తరలించారు. వారి నుంచి సుమారు 40 గంజాయి ప్యాకెట్లు లభించినట్లు ఎస్ఐ తెలిపారు. వాటిలో సుమారు అరకిలో వరకు గంజాయి ఉన్నట్లు చెప్పారు. దీన్ని విలువ రూ.25వేల వరకు ఉంటుందన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా వీరిద్దరితోపాటు ఇంకా ఎవరెవరు ఇందులో ఉన్నారన్న దానిపై పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఐదురోజుల జైలు

మహబూబ్‌నగర్ క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన ఓ వ్యక్తికి జరిమానాతోపాటు ఐదురోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఆనంద్ చారిని గురువారం కోర్టులో హాజరుపరచగా.. న్యాయమూర్తి డి.నిర్మల అతడికి రూ.2,500 జరిమానాతోపాటు ఐదురోజుల జైలుశిక్ష విధించారు.

జింకు లోపం లక్షణాలు పరిశీలించాలి

అధికారి సలహా
సక్రియనాయక్
ఏడీఏ, అలంపూర్



జింకులోపంతో ఉన్న వరి మొక్కలు



అలంపూర్: వరి సాగు పనులు కొనసాగుతున్నాయి. పంట సాగుకు అనువుగా అనేక మంది రైతులు వరి నారుమడులు పోసుకున్నారు. మడుల్లో జింకు లోపం లక్షణాలు ఉన్నాయేమో రైతులు పరిశీలించుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచిస్తున్నారు. లక్షణాలను గుర్తిస్తే తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. లేకుంటే ఎన్ని ఎరువులు వేసినా వ్యర్థమేనని పేర్కొన్నారు.

జింకు లోపం, లక్షణాలు, నివారణ చర్యలు..

వరిలో ఎరువుల యాజమాన్య పద్ధతులు సద్వినియోగం కావాలన్నా.. అధిక దిగుబడి సాధించాలన్నా.. జింకు లోపం నివారణకు ప్రాధాన్యత ఇవ్వాలి. పైరు పెరుగుదలకు అవసరమైన పోషకాలను, నత్రజని, భాస్వరం, పొటాషియం ప్రధానమైనవి. వీటితో పాటు జింకు, కాల్షియం, మెగ్నీషియం వంటి తదితర 16 రకాల సూక్ష్మధాతువులు కూడా అవసరం. వీటిలో జింకు పాత్ర కీలకం. ప్రధాన పోషకాలతో పోల్చితే ఇది చాలా తక్కువ పరిమాణంలో అవసరమైనా.. ప్రాముఖ్యత విషయంలో ప్రధాన పోషకాలతో సమానం. జింకు లోపిస్తే ఎన్ని ఎరువులు వేసినా.. ఎటువంటి ఉపయోగం ఉండదు.

జింకు లోపిస్తే ఎరువులు వృథా..

జింకు లోపం ఉంటే నత్రజని, భాస్వరం, పొటాష్ ఎంత వేసినా వృథాగా మారుతాయి. మొక్కలు, ఎరువులను సమర్థవంతంగా వినియోగించుకోలేవు. దిగుబడి పెరగవు. మొక్కల పెరుగుదల కోసం పలు రసాయన ప్రక్రియలో అవసరమయ్యే ఎంజైములు చురుకుదనాన్ని పెంచడానికి, ఉత్తేజ పర్చడానికి జింకు ఉపయోగపడుతుంది. ఈ పోషకం లోపిస్తే ఆ ప్రక్రియ సజావుగా జరగవు.

ముందస్తు చర్యలు ఇలా..

జింకు లోపం ఉన్నట్లు తేలితే తప్పనిసరిగా ముందుగానే సరైన మోతాదులో జింకు సల్ఫేట్ వేసుకోవాలి. వరి పంటకైతే ఎకరానికి 20 కిలోల జింకు సల్ఫేట్‌ను దుక్కిలో నాటే ముందు వేసుకోవాలి. మూడు పంటలకు ఒకసారి లేక రెండేళ్లకు ఒక సారిగాని వేసుకోవాలి. ఏటా వరి సాగు చేస్తుంటే యాసంగిలోనే జింకు వేసుకోవాలి. సమస్యాత్మక నేలలు అంటే క్షార చౌడు సున్నపు నేల అయితే జింకు సల్ఫేట్‌ను ఎకరానికి 40 కిలోల చొప్పున వేసుకోవాలి.

నివారణ చర్యలు ఇలా..

వరిలో జింకు లోపం కనిపిస్తే పది లీటర్ల నీటికి 20 గ్రాముల జింకు సల్ఫేట్ కలిపి ఎకరానికి 200 లీటర్ల చొప్పున పిచికారీ చేయాలి. ఇలా వారం రోజుల వ్యవధిలో రెండు, మూడు దఫాలు పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుంది. ఎకరానికి రెండు క్వింటాళ్ల పశువుల ఎరువులు, కంపోస్టు, కోడి ఎరువు, ఫిల్టర్ మట్టి వంటి సేంద్రియ ఎరువులతో 15 కిలోల జింకు సల్ఫేట్ కలిపి నెల రోజులు మాగనిచ్చి నాటే ముందు దుక్కిలో వేస్తే దిగుబడుల్లో మార్పు కనిపిస్తుంది.

జింకు లోపాన్ని ఇలా గుర్తించాలి..

వరి నాడు మడి దశలోనూ నాటిన తర్వాత కూడా జింకు లోపం కనిపిస్తోంది. సాధారణంగా నాట్లు వేశాక రెండు నుంచి నాలుగు వారాల మధ్య నాలుగు నుంచి ఆరు వారాల మధ్య జింకు లోపం లక్షణాలు బయటపడుతాయి. జింకు లోపం ఉన్న పొలాల్లో ప్రధాన పోషకాలు తగినంత వేసినా పంట సరిగా పెరగదు. పిలకలను పెట్టదు. పొలంలో మొక్కలు చనిపోయి ఖాళీలు కనిపిస్తాయి. పొలం అంత పసుపు పచ్చగా కనబడుతుంది. దగ్గరగా చూస్తే మొక్కల్లో పైనుంచి మూడు లేక నాలుగు ఆకుల మధ్య ఈనె మొదలు భాగం ఆకు పచ్చ రంగు కోల్పోయి పసుపుతో కూడిన తెలుపు రంగులోకి మారుతుంది. ఆకులోని మిగిలిన భాగం అంతా ఆకు పచ్చగానే ఉంటుంది. ఆకులు చిన్నగా నూలు కండిలుగా మారి మొద్దు బారుతాయి. గట్టిగా మారి వంచి చూస్తే శబ్దం చేస్తూ విరుగుతాయి.